క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, తిరిగి సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు, పల్లకిసేవ గావించారు.

బైక్‌ల ఢీ

• ఇద్దరికి గాయాలు



గాయపడిన యువకుడు

మనుబోలు : రెండు మోటార్ బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ఘటన మనుబోలు మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదురుగా జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. నెల్లూరు నుంచి ఇద్దరు యువకులు బైక్‌పై గూడూరు వైపు వస్తున్నారు. కాగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి మరో మోటార్ బైక్ మనుబోలు ఊరిలోకి వెళ్లేందుకు హైవేపైకి రావడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మనుబోలుకు చెందిన శీనయ్యకు, నెల్లూరుకు చెందిన మరో యువకుడికి గాయాలయ్యాయి.

వైస్ ఎంపీపీకి మాతృవియోగం

కోవూరు : మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి శివుని లక్ష్మమ్మ (82) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఈ మేరకు మంగళవారం ఆమె భౌతికకాయానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉత్సాహంగా పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో తైక్వాండో కలర్ బెల్ట్ పోటీలను మంగళవారం నిర్వహించారు. తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ సలామ్, జిల్లా కార్యదర్శి అఖిల్, శ్రీనివాసరావు, చరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పతనం ఖాయం



తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీలో చేరిన పాపిరెడ్డిపాళెం నేతలతో కాకాణి



పొదలకూరు : మంత్రి కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలు

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ పతనం ఖాయమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం పంచాయతీ అరుంధతీ కాలనీకి చెందిన పది టీడీపీ కుటుంబాలు మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీలో చేరాయి. నెల్లూరులోని మంత్రి నివాసంలో కాకాణి వీరికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరిగిపోతున్నాయన్నారు. ముఖ్యంగా సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ వలసలు అధికమవుతుండడంతో ఆ పార్టీ కనుమరుగయ్యే స్థితికి చేరుకుందన్నారు. పార్టీలోకి వస్తున్న నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు, పాపిరెడ్డిపాళెం నేత తిరువళ్లూరు ఈశ్వరయ్య, స్థానిక నాయకులు టి.వెంకటేశ్వర్లు, దద్దోలు వెంకటకృష్ణయ్య, నెల్లూరు లక్ష్మణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

పొదలకూరు : మండలంలోని ప్రభగిరిపట్నం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మంగళవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంతో కాలంగా టీడీపీలో కొనసాగుతున్న 30 కుటుంబాలకు చెందిన వారు నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా కాకాణి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సర్వేపల్లిలో టీడీపీ ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. సోమిరెడ్డికు డిపాజిట్ కూడా దక్కదన్నారు.

ఆరోగ్య సురక్షతో కార్పొరేట్ వైద్యం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లాస్య

మనుబోలు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పేదలకు కూడా కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తెచ్చిందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గేయ పూజిత అన్నారు. మండలంలోని కాగితాలపూరు సచివాలయ పరిధిలో రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. జనరల్ మెడిసిన్ డాక్టర్ లాస్య, కంటి విభాగం వైద్యులు కవిత, బావన రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, హెల్త్ సూపర్‌వైజర్‌లు వెంకటరమణయ్య, హైమావతి, ఫార్మాసిస్ట్ పద్మజ, హెల్త్ అసిస్టెంట్లు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, ఈఓపీఆర్డీ వెంకటరమణ, కార్యదర్శి విమల, వీఆర్వో వెంకయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోట్లు దండుకున్న పోలంరెడ్డి

• ప్రత్యక్ష సాక్షులే చెప్పారు
• డీసీఎమ్మెస్ ఛైర్మన్ చలపతిరావు



మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నుంచి రూ.కోట్లు దండుకుని ఇప్పుడు ఒక్క రూపాయి తీసుకోలేదని మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు వెంకటేశ్వరస్వామిపై ఒట్టు వేయడం హాస్యాస్పదంగా ఉందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. నార్తురాజుపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్‌ను వీడనని చెప్పి మరుసటి రోజే టీడీపీ కండువా కప్పుకున్న చరిత్ర పోలంరెడ్డిదే అన్నారు. ఆయన వీపీఆర్ నుంచి ఒక్క రూపాయి కాకుండా రూ.కోట్లు తీసుకున్నారని ప్రత్యక్ష సాక్షులే తనకు స్వయంగా తెలిపారన్నారు. నిన్ను నమ్ముకుని వెంట నడిచిన వారి పరిస్థితి ఇప్పుడు అగమ్య గోచరంగా మారడానికి సమాధానం చెప్పాలన్నారు. అసలు టీడీపీ వారంతా కనుమరుగయ్యారంటే అందుకు నువ్వు బాధ్యుడివి కావా అని ప్రశ్నించారు. నీవు డబ్బు తీసుకోలేదని జొన్నవాడ కామాక్షమ్మ ఎదుట ప్రమాణానికి రావాలని సవాల్ విసిరారు. వృద్ధులు, వికలాంగుల పింఛన్లకు గండికొట్టిన చంద్రబాబు ప్రజలకేం మేలు చేస్తారో ఆలోచించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సచివాలయాల మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ ఎం.రంగారెడ్డి, ఎంపీటీసీ పి.అనిల్‌రెడ్డి, నాయకులు ఎ.మోహనకృష్ణ, ఐ.సునీల్‌రెడ్డి, బి.శ్రీనివాసులు, ఆర్.రాజేష్‌రెడ్డి, పి.సతీష్‌రెడ్డి, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

మనుబోలు : మండలంలోని వెంకన్నపాళెం, బద్దెవోలు, పిడూరుపాళెం గ్రామాల్లో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ నేతలు ఏడెం మల్లికార్జునరెడ్డి, వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రచారం ప్రారంభం అవుతుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

కరకంబాక కృష్ణ సస్పెన్షన్

కొడవలూరు: మండలంలోని పద్మనాభసత్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కరకంబాక కృష్ణను సస్పెండ్ చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య మంగళవారం తెలిపారు. నార్తురాజుపాళెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడంతో ఆయన్ను సస్పెండ్ చేశామన్నారు.

సచివాలయ సిబ్బందితో సమావేశం

కోవూరు : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ శ్రీరామాంజనేయులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ద్వారానే పింఛన్ల పంపిణీ జరగాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నాగూర్‌వలి పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

• వీఎస్‌యూ వీసీ సుందరవల్లి



ఓటు హక్కు అవగాహన కార్యక్రమంలో వీసీ, అధ్యాపకులు

వెంకటాచలం : 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో అమరవీరుల దినోత్సవంలో భాగంగా ఓటు హక్కుపై అవగాహన సదస్సు, పరిశుభ్రత కార్యక్రమాలను మంగళవారం చేపట్టారు. తొలుత వీసీ సుందరవల్లి విద్యార్థులు, అధ్యాపకులతో ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓటు ద్వారా తమ పాలకులను ఎన్నుకునే గొప్ప అవకాశం రాజ్యాంగం కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మన కోసం కాకుండా అందరి కోసం తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని, పట్టణాలు, నగరాల్లోనూ ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వీఎస్‌యూ ఆవరణలో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ కె.సునీత, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై అనుచిత వ్యాఖ్యలు తగవు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కోవూరు : రాష్ట్రంలో పారదర్శకంగా అమలవుతున్న పింఛన్ల పంపిణీపై ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని డీఎల్డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, జల్‌జీవన్ మిషన్ చైర్మన్ గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ అహ్మద్ అన్నారు. కోవూరు మండల కేంద్రంలో వారు మంగళవారం మాట్లాడారు. వలంటీర్లు సామాజిక సేవగా భావించి ప్రభుత్వ పథకాలను అందిస్తుంటే వారిపై రాజకీయాలు చేయడం తగదన్నారు. వలంటీర్లకు తాము వ్యతిరేకం కాదంటూనే ఆ వ్యవస్థపై చంద్రబాబు విమర్శలు చేస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమన్నారు. టీడీపీ చర్యలతోనే పేదలకు పింఛన్లు రాలేదని, దీనికి ప్రజలే ఓటు రూపంలో బుద్ధి చెబుతారన్నారు.

సచివాలయాల్లోనే పింఛన్ల పంపిణీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ మహ్మద్‌రఫీ

పొదలకూరు : గ్రామ సచివాలయాల్లోనే వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లను అందజేస్తారని ఎంపీడీఓ మహ్మద్‌రఫీ పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కె.సుబ్బరాయుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. 3వ తేదీ నుంచి సచివాలయాల్లో పింఛన్లను అందజేస్తారని ఎంపీడీఓ తెలుపగా, ఎంపీటీసీ సభ్యులు కె.రామిరెడ్డి, జి.శ్రీనివాసులు తదితరులు సచివాలయాల్లో పింఛన్లను అందజేస్తే వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు వెళ్లి తీసుకోలేరని, మానవతా కోణంలో ఇళ్లకు వెళ్లి అందజేయాల్సిందిగా పట్టుపట్టారు. దీనిపై ఎంపీడీఓ మాట్లాడుతూ తమకున్న ఉత్తర్వుల ప్రకారం సచివాలయ ఉద్యోగుల ద్వారా ఉదయం నుంచి సాయంత్రం వరకు పింఛన్లను పంపిణీ చేస్తామన్నారు. ఇందులో ఎలాంటి ప్రత్యామ్నాయాలకు తావులేదని, కొత్తగా ఉత్తర్వులు అందితే తెలియజేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనా నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేవన్నారు. వేసవి తాపం అధికమైతే తాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని, అందుకు సంబంధించిన ఏర్పాట్లను కూడా సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ సోమ అరుణ, సర్పంచ్ చిట్టెమ్మ, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి స్ట్రెచర్ వితరణ



పొదలకూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి పట్టణానికి చెందిన మెడికల్‌షాపు నిర్వాహకుడు భోగనాథం శరత్‌కుమార్ తన తండ్రి హరినాథ్ జ్ఞాపకార్థం స్ట్రెచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన వలంటీర్ల రాజీనామాలు



కొడవలూరు: నార్తురాజుపాళెంలో రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్‌లు



కొడవలూరు: కమ్మపాళెంలో రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్‌లు

కొడవలూరు: వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు కొనసాగుతున్నాయి. మండలంలోని నార్తురాజుపాళెంలో 33 మంది, కమ్మపాళెంలో 16 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామాలు చేశారు. నార్తురాజుపాళెంలో పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య, కమ్మపాళెంలో పంచాయతీ కార్యదర్శి ఆర్.శివకుమార్‌లకు వారు రాజీనామా పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వలంటీర్‌లు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి తమకు ఎంతో గౌరవం కల్పించి ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించారని, చంద్రబాబు కుట్ర వల్ల ప్రస్తుతం ఏమీ చేయలేకపోతున్నామని వాపోయారు. ఈ ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డికి వెన్నుదన్నుగా నిలిచి ఆయన్ను మరలా సీఎంను చేసుకుని ప్రజలకు సేవలందిస్తామని స్పష్టం చేశారు.

పడుగుపాడులో..

కోవూరు : మండలంలోని పడుగుపాడు పంచాయతీకి సంబంధించిన 62 మంది వలంటీర్లు మంగళవారం తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సేవలు అందిస్తున్న తమపై కక్షగట్టడం తగదన్నారు.



కోవూరు : రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్లు

6 నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు



పేపర్లను సరిచూస్తున్న సిబ్బంది

మనుబోలు : ఈనెల 6వ తేదీ నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు ప్రారంభమవుతాయని ఎంఈఓ శేషాద్రివాసు తెలిపారు. స్థానిక విద్యావనరుల కేంద్రానికి చేరుకున్న పరీక్ష పత్రాలను ఆయన మంగళవారం సరిచూశారు.
మండలంలోని అన్నిప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈనెల 6 నుంచి 18 వరకు వార్షిక పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఆయన వెంట సీఆర్ఎంటీలు స్వరూప, జయరామయ్య, చెంచురామయ్య, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఆదిశేషయ్య తదితరులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయి

• ముమ్మరంగా ఇంటింటి ప్రచారం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఎన్నికల ప్రచారం చేస్తున్న రజత్‌కుమార్‌రెడ్డి



పొదలకూరు : ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పూజిత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ గెలుపునకు నాంది అని ఆ పార్టీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం, కట్టుబడిపాళెం గ్రామంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించి ఓటు వేయాలని కోరారు. అనంతరం రజత్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నారంటే అది కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, నగర పంచాయతీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కపాళెంలో..

నగర పంచాయతీ పరిధిలోని ఇస్కపాళెం మజారా పోలినేని చెరువు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేబాల గ్రామంలో..

రేబాల గ్రామం మజారా పడమటి హరిజనవాడ, పెద్దూరు, ఉమ్మడితోపు తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నాగమాంబపురంలో..

నగర పంచాయతీ పరిధిలోని నాగమాంబపురంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఇంటింటి ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు.

జగనన్నది జనరంజక పాలన

ఇందుకూరుపేట: సీఎం వైఎస్ జగనన్నది జనరంజక పాలన అని, వైఎస్సార్‌సీపీని ఆదరించాలని జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరులో స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎంపీగా విజయసాయిరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వెంకురెడ్డి, విజయ్‌కుమార్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాకాణిని ఆశీర్వదించండి

మనుబోలు : ఐదేళ్లుగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కాకుండా అన్నిరకాలుగా గ్రామాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని, మరోసారి సర్వేపల్లి శాసనసభ్యుడిగా కాకాణిని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. కాకాణి కోసం మేము సిద్ధం అంటూ మనుబోలు మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించారని, ఆయన్ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ముంగర రవీంధర్‌రెడ్డి, చల్లా నవకోటి, కేవీఆర్‌గౌడ్, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, కోసూరు కోటేశ్వరగౌడ్, సూరపనేని కిశోర్‌నాయుడు, తుపాకుల గిరి తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధి

పొదలకూరు : అన్నిరంగాల్లో పొదలకూరు అభివృద్ధి చెందిందని, ఇందుకు తన తండ్రి అహర్నిశలు పాటుపడినట్లు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పేర్కొన్నారు. పట్టణంలోని తొగటవీధి, శ్రామికనగర్, వినాయకమాన్యం, పద్మావతినగర్ ప్రాంతాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదలకూరు బిట్-2 సచివాలయ పరిధిలో సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.25 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. పూజిత వెంట సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, వైస్ ఎంపీపీ సోమా అరుణ, జెడ్పీటీసీ నిర్మలమ్మ, సర్పంచ్ చిట్టెమ్మ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, వార్డుసభ్యులు అంజాద్, విజయలక్ష్మి, పద్మావతి, నాయకులు ఎం.శివప్రసాద్, సోమా భాస్కర్, వూకోటి లక్ష్మీనారాయణ, ఎం.శేఖర్‌బాబు, భాస్కర్‌రెడ్డి, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఖాదర్, హేమంత్, సోమా పెంచలయ్య, రామకృష్ణయ్య, ఎల్.ఆనంద్‌రావు తదితరులు ఉన్నారు.

తాటిపర్తిలో..

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక గిరిజన కాలనీలో వైఎస్సార్‌సీపీ నేత పామూరు లచ్చారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేసి మంత్రి కాకాణి చేపట్టిన అభివృద్ధి పనుల కరపత్రాలను అందజేశారు. పామూరు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రచారాల హోరు

కొడవలూరు: మండలంలో వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారాలు మంగళవారం హోరెత్తాయి. మండలంలోని యల్లాయపాళెంలో విజయా డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తారని స్పష్టం చేశారు. ఎంపీటీసీ కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, నాయకులు సమీ ఉద్దీన్, ఎరగాల పెంచలయ్య పాల్గొన్నారు.

బసవాయపాళెంలో..

మండలంలోని బసవాయపాళెంలో వైఎస్సార్‌సీపీ నేత పెళ్లేటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. సర్పంచ్ పెళ్లేటి రజని పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: కొత్తూరులో..



మనుబోలు : ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న నాయకులు



పొదలకూరు : ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు



కొడవలూరు: యల్లాయపాళెంలో..